మొక్కలు నాటి సంరక్షించాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో వనమహోత్సవం

చేవెళ్ల రూరల్, జూలై 11 : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ఎంఎన్ఆర్ కాలనీలో 75వ వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై అధికారులు సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్, ఎంపీడీవో వెంకయ్య, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

నాటకాలకు పూర్వవైభవం తీసుకువస్తాం

జాతీయ బాలల నాటకోత్సవ వాల్‌పోస్టర్ విడుదల

షాద్‌నగర్‌రూరల్, జూలై 11 : జాతీయ బాలల నాటకోత్సవం 2024కు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంతరించిపోతున్న నాటక ప్రదర్శనలకు పూర్వవైభవం తీసుకురావాడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. అనంతరం కార్యక్రమం నిర్వాహకులు టి.వి రంగయ్య మాట్లాడుతూ ఈ జాతీయ బాలల నాటకోత్సవాన్ని ఈనెల 20, 21వ తేదీల్లో హాజిపల్లిలోని ఏవీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ మూడు నాటక ప్రదర్శనలను చిన్నారులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్, రమేశ్, రవీందర్, శివ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే జైలుకే..

పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 11 : రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు రేషన్ డీలర్లు బయోమెట్రిక్ యంత్రాలను ఇష్టారాజ్యంగా తరలించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న చౌక ధరల దుకాణాలకు చెందిన బయోమెట్రిక్ యంత్రాలను సిటీకి తీసుకెళ్లి ఏదో ఒక దుకాణంలో పెట్టి దందా చేస్తున్నారనే సమాచారం ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బయోమెట్రిక్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

చేవెళ్లలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

చేవెళ్ల రూరల్, 11 జూలై : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశానుసారం గురువారం చేవెళ్లలోని డిప్యూటీ డీఎంజీ కార్యాలయం నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ పాల్గొని, జనాభా నియంత్రణ, సంపూర్ణ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో నినాదాలు చేయించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ మాట్లాడుతూ.. జనాభా నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు. జనాభా నియంత్రణకు అంతరా ఇంజక్షన్ వాడి నియంత్రించవచ్చునన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

డెంగీ, విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి..

ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే కొనసాగించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, మంజుల, సంతోష, ఎంపీహెచ్‌ఈవో బలరాం, ఆలూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌పీహెచ్‌లు, ఎల్టీ, డీఈవోలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి సరిత అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కీర్తన, సూపర్‌వైజర్లు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

యాచారంలో అవగాహన

యాచారం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై ఆరోగ్య, ఐసీడీఎస్, పంచాయతీ అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలుషిత నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై మెడికల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో చెత్తా చెదారం లేకుండా పంచాయతీ కార్మికులు ప్రధాన దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు జింక్ మాత్రలు వేయించాలని సూచించారు. ఇండ్ల మధ్య బ్లీచింగ్ పౌడర్ వేసేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఐసీడీఎస్, పంచాయతీ అధికారులు ఉన్నారు.

శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

చేవెళ్ల రూరల్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రేవతి అన్నారు. గురువారం శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధి గ్రామాల సబ్ సెంటర్ల సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ.. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంఎల్ హెచ్‌పీ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

యాచారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

మాజీ మంత్రి సబితారెడ్డిని

కలిసిన బీఆర్ఎస్ నేతలు

కడ్తాల్, జూలై 11: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో, రావిచేడ్ మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు కృషి చేయాలని సూచించినట్లు వారు పేర్కొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ కందుకూరు మండల నాయకుడు మహేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, జూలై 11: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధి ఆదిత్యనగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, గుర్రంగూడ పరిసర ప్రాంతాల్లో సాధారణ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తుర్కయాంజాల్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మన్నెగూడ ఫీడర్, ఎంఎం కుంట, ఎన్ఎస్ఆర్‌నగర్ కాలనీ, ఆర్‌టీఏ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

స్థానిక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

షాబాద్, జూలై 11: ఉపాధ్యాయుల బదిలీల్లో 317జీవోలో ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డిజిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులను వెనక్కి పంపించి స్థానిక ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండలంలోని హైతాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన సుదర్శన్, రూబీ, పరమేశ్‌రెడ్డి, అమృత, భాగ్యలక్ష్మి, జయన్న, పాండురంగం తదితర ఉపాధ్యాయులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదయ్య, మాజీ సర్పంచ్ శేఖర్, రాజుగౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, కృష్ణ, వివిధ మండలాల అధ్యక్షులు వీరమల్లేశ్, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, జయరాజ్, యాదయ్య, ఉపాధ్యాయులు మాధవి, గీత, గోవిందా, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి

పెద్దఅంబర్‌పేట, జూలై 11: మున్సిపాలిటీ మూడోవార్డు పరిధి కళానగర్‌లో రూ.14 లక్షలతో చేపట్టనున్న మహిళా పొదుపు సంఘాల భవన నిర్మాణానికి కౌన్సిలర్ మోతె మణెమ్మ శంకుస్థాపన చేశారు. వార్డు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాల సభ్యుల సమావేశాల కోసం భవనం నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చర్లపల్లి శంకరయ్యగౌడ్, నాయకులు రామలింగం, చిరంజీవి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచాల మండలం దాద్‌పల్లి గ్రామంలో దుర్గాబాయి మహిళా శిశు సంక్షేమ వికాస కేంద్రం ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 12మంది మహిళలకు మంచాల మాజీ జడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో కుట్టుమిషన్లను గురువారం ఆమె అందజేశారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి ఉన్నారు.

- మంచాల, జూలై 11

పోలీసులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

చేవెళ్లటౌన్, జూలై 11: సిద్దపేట జిల్లా కోర్టు న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రవికుమార్ పైన దాడి చేసిన పోలీసులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉన్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాడిని ఖండిస్తూ న్యాయవాదులు గురువారం నిరసన తెలిపి కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్‌బార్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది యాదిలాల్, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, ట్రెజరర్ మధు, లైబ్రేరియన్ శేఖర్ న్యాయవాదులు మల్లేశ్, జగన్‌గౌడ్, గణేశ్, శేఖర్, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, సర్దార్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

22న చలో కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్

ఆమనగల్లు, జూలై 11: పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా చలో కలెక్టరేట్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22 చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేకుండా చెట్ల కిందనే విద్యార్థులకు బోధన చేస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.730 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, డివిజన్ కార్యదర్శి కురిమిద్ద శివ, నాయకులు సాయి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

కొత్తూరు, జూలై 11: పారిశ్రామిక పార్కుకోసం భూమి తీసుకున్న రైతులకు సరైన పరిహారం అందలేదని సిద్దాపూర్ రైతులు గురువారం ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళితే.. సిద్దాపూర్ శివారులో 330.34 ఎకరాల భూమిని పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అప్పగించింది. అయితే పరిహారం రైతులకు అందలేదని వారు ధర్నాకు దిగారు. పరిహారం చెల్లింపులో కుంభకోణం జరిగిందని వారు వాపోయారు. పట్టా పాసు పుస్తకాలు ఉన్న, అసైన్డ్ భూములు సాగుచేస్తున్న రైతులు కాకుండా ఇతరుల పేర్లు చేర్చి సొమ్ము కాజేశారని వారు వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే శంకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, కలెక్టర్‌ను కలిసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని వినతి

తుర్కయాంజాల్,జూలై 11: మున్సిపాలిటీ రాగన్నగూడ బ్రహ్మణపల్లి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టడంతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సామ రెసిడెన్షిల్ అసోసియేషన్ సభ్యులు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శివకుమార్, మణిపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, యాదయ్య, శ్రీను పాల్గొన్నారు.

కబ్జా నుంచి విముక్తి కల్పించాలి

చేవెళ్ల రూరల్, జూలై 11 : శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి అనుబంధ గ్రామం కొజ్జాగూడలో శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. గురువారం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు తమ భూమిని కబ్జా చేయడం ఏంటని ప్రశ్నిస్తే ఈ భూమిని తాను కొనుగోలు చేశానని చెప్పారని తెలిపారు. అక్రమంగా శ్మశాన వాటిక భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని తిరిగి మాకు అప్పగించాలని కోరారు.

ఫుడ్ స్టాళ్ల సిబ్బందికి టైఫాయిడ్ పరీక్షలు చేయించాలి

కొత్తూరు, జూలై 11: ఫుడ్ స్టాళ్ల సిబ్బందికి టైఫాయిడ్ పరీక్షలు చేయించాలని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. డీఎంఎ ఆదేశాల మేరకు కొత్తూరు మున్సిపాలిటీలోని పానీపూరీ బండీలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిను పదార్థాలు అమ్మే స్టాళ్ల సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల హోటల్స్ నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, జూలై11: అక్రమంగా తరలిస్తున్న 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం యాచారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం..మండలంలోని తక్కళ్లపల్లి సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వాహనాన్ని తనిఖీ చేయగా, 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. కడ్తాల్ మండలం పల్లెచెల్కతండాకు చెందిన జగన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంతో పాటు బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మొయినాబాద్, జూలై11: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గతంలో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో వీడ్కోలు పలికి సన్మానించారు. కొత్తగా బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీరాంనగర్ మాజీ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి, ఏఏపీఈ చైర్మన్ వినోద్, ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, అలివేలు, సుజాత, స్వర్ణలత పాల్గొన్నారు.

ఓంకారేశ్వరాలయానికి ధర్మకర్త నియామకం

యాచారం, జూన్11: మండలంలోని నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయ అనువంశ ధర్మకర్తగా అదే గ్రామానికి చెందిన పప్పు వెంకట శివకుమార్ కాశ్యపన్‌ను నియమిస్తూ తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆయనను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఘనంగా సన్మానించి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి దేవరశెట్టి ప్రవీణ్, పురోహితులు, గ్రామస్తులు ఉన్నారు.

నేడు పూరీ జగన్నాథ రథయాత్ర

ఆమనగల్లు, జూలై 11: ఆమనగల్లు పట్టణంలో కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ వారి సౌజన్యంతో శుక్రవారం జరుగనున్న పూరీ జగన్నాథ రథయాత్ర రథం గురువారం ఆమనగల్లు పట్టణానికి చేరుకోవడంతో మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రథయాత్ర నిర్వాహకులు మాట్లాడుతూ ఈ రథయాత్ర పట్టణంలోని అయ్యప్ప కొండ నుంచి మధ్యాహ్నం 3.30 నిమిషాలకు ప్రారంభమవుతందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డిని అఖిల భారత గౌడ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తోర్పునూరి ధనంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో గురువారం గౌడ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు గౌడ కుల పెద్దలు ఊషయ్యగౌడ్, ధన్‌రాజ్‌గౌడ్, బాటసింగారం మాజీ సర్పంచ్ జగదీశ్ ఉన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్ (తలకొండపల్లి), జూలై 11: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన బండగళ్ల రవి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ గురువారం బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, నాయకులు జ్యోతయ్య, విజయ్‌కుమార్, యాదయ్య, దశరథ్, శ్రీశైలం, శివ, వెంకటేశ్‌యాదవ్, ఈశ్వర్, విఠల్, నర్సింహ, మల్లేశ్, శ్రీను పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

మంచాల, జూలై 11: వనమహోత్సవాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. గురువారం మంచాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వనమహోత్సవం, వర్షాకాలంలో అంటు వ్యాధుల నివారణపై గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమున్న చోట మొక్కలను నాటాలని వారు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రజలను చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

షాబాద్, జూలై 11: ఇంట్లో నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... షాబాద్ మండలంలోని గోపిగడ్డ గ్రామానికి చెందిన మొముల శ్రీపాల్‌రెడ్డి ఈ నెల 10వ తేదీన నవాబుపేట్ మండలంలోని పూలపల్లి గ్రామానికి తన మామ దశదినకర్మకు వెళ్తున్నానని, ఇంట్లో తన తల్లి లలితకు చెప్పి వెళ్లాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు పూలపల్లి గ్రామానికి వెళ్లి ఆరా తీయగా, శ్రీపాల్‌రెడ్డి అక్కడికి రాలేదని చెపడంతో శ్రీపాల్‌రెడ్డి సోదరుడు జంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)